లడ్డూ తయారీ కేంద్రం మార్పునకు చర్యలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ బేడా మండపంలోనే ఇప్పటివరకు భక్తులకు అన్నప్రసాదాల తయారీ, పంపిణీతోపాటు లడ్డూ ప్రసాదాల తయారీ నిర్వహిస్తున్నారు. ఇరుకుగా ఉన్న ఈ కొద్దిస్థలంలోనే ఈ పనులు నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఆలయ సిబ్బంది, భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.


బేడా మండలంలో సాగుతున్న లడ్డూ ప్రసాదాల తయారీ

పూర్తిస్థాయిలో అన్నదానం...

ప్రస్తుతం అమ్మవారి ఆలయంలో శుక్రవారం 100మందికి, ఆదివారం 200, మిగిలిన రోజుల్లో 75 మందికి అన్నదానం చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో పూర్తిస్థాయిలో అన్నదానం చేపట్టనుండటంతో ప్రస్తుతం ఉన్న అన్నప్రసాదం స్వీకరించే స్థలం సరిపోదు. నివేదన కోసం ఒక కుక్, ఇద్దరు సహాయకులు ఉన్నారు. అన్నప్రసాదాల తయారీ కూడా ఒక్క కుక్ మాత్రమే చేస్తున్నారు. పూర్తి స్థాయిలో అన్నదానం నిర్వహిస్తే నూతన స్థలంతో పాటు సిబ్బంది పెంచాల్సిన అవసరం ఉంది. నూతన అన్నప్రసాదాల కోసం మొదట కేశఖండనశాల పక్కన అని అధికారులు భావించినప్పటికీ భక్తుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. దీంతో ఆలయం పక్కన దక్షిణం వైపు పొంగళ్ల షెడ్లులోకి మార్చి, పొంగళ్ల షెడ్లను వెనుక ఉన్న షెడ్లలోకి మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.



అన్నదానం కోసం సిద్ధం చేయాలనుకుంటున్న పొంగళ్ల షెడ్లు

ప్రమాదకరంగా లడ్డూ పోటు...

బేడా మండపంలో భక్తుల క్యూలైన్ పక్కన లడ్డూ ప్రసాదాల పోటు ఉంది. గతంలో పలుమార్లు పోటులో చిన్నచిన్న ప్రమాదాలు సంభవించాయి. గత ఏడాది ఏప్రిల్ 10న పోటులో మంటలు వ్యాపించగా, సిబ్బంది వెంటనే స్పందించి మంటలు ఆర్పటంతో ప్రమాదం తప్పింది. అలాగే మంటకు బేడా మండపం శ్లాబ్‌తోపాటు గోడలు కూడా పగుళ్లు వచ్చి దెబ్బతింటున్నాయి. ఈనేపథ్యంలో లడ్డూ పోటును కూడా బేడా మండపం బయట ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేలా ఆలయ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఆలయ సిబ్బంది రహస్య భేటీ!

ఈవో తీరుపై గుర్రు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఈఓ కిషోర్‌కుమార్‌పై సిబ్బందితోపాటు అర్చకులు గుర్రుగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై చర్చించేందుకు సిబ్బంది శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలోనే రహస్య భేటీ నిర్వహించినట్లు సమాచారం. అన్ని విభాగాల ఉద్యోగులు ఆయన తీరుపై గుర్రుగా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల విజయవాడ శ్రీకనకదుర్గమ్మవారి ఆలయానికి బదిలీ అయిన ఓ అధికారి విషయంలో కూడా ఈవో వ్యవహరించిన తీరు బాధించిందనే చర్చ సిబ్బంది మధ్య సాగినట్లు తెలిసింది. తమకు సంబంధం లేని పనులు కూడా తక్షణం చేయాలని ఈవో ఇబ్బంది పెడుతున్నారని, అందరి ముందు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ బాధపెడుతున్నారనే అభిప్రాయాన్ని సిబ్బంది వ్యక్తంచేసినట్లు సమాచారం. మొత్తమ్మీద ఆలయ ఈవో తీరుపై సిబ్బంది అంతా రహస్య భేటీ నిర్వహించడం పెనుగంచిప్రోలులో చర్చనీయాంశమైంది.

రక్తదానంపై అవగాహన ర్యాలీ

నందిగామరూరల్: రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో శనివారం అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మనం చేసే రక్తదానం ఇతరుల ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో త్వరలోనే రక్తనిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మాధవీలత, సింధూర, జగదీష్, ఆయుర్వేద వైద్యాధికారి కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

హోమియో మందుల పంపిణీ

నందిగామ రూరల్: కరోనా మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని హోమియో వైద్యుడు బొందలపాటి నరసింహారావు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీ సెంటరులో కరోనా రాకుండా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వార్తల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా హోమియో మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సీతారామయ్య, మాలెంపాటి ప్రసాద్, చెరుకూరి శ్రీనివాసరావు, ఎర్రంరెడ్డి గాంధీ, గోపు సుబ్రహ్మణ్యం, ఆర్‌కె క్లాత్స్ నూకేశ్వరరావు, ఆవుల రాము తదితరులు పాల్గొన్నారు.


హోమియో మందులను పంపిణీ చేస్తున్న హోమియో వైద్యుడు నరసింహారావు

నిబంధనల పేరుతో మోసం తగదు

జగ్గయ్యపేట: తల్లికి వందనం పథకం అమలులో నిబంధనల పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు శనివారం విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి నేడు రూ.13వేలు ఇస్తామనడం మోసం కాదా అని ప్రశ్నించారు. నెలకు 300 యూనిట్‌లకు మించి విద్యుత్‌ను వినియోగించేవారు అనర్హులనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. పలు రకాల నిబంధనలతో ఎంతో మందిని అనర్హులుగా చేసేందుకు కుట్ర పన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా అమలుచేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

శంభులింగేశ్వరునికి ధారపాత్ర సమర్పణ



నందిగామ రూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి వారికి భక్తులు ధారపాత్ర అందజేసినట్లు ఆలయ చైర్మన్ చావా అర్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బత్తిన వెంకటప్పయ్య కుటుంబసభ్యులు రూ. 60 వేల విలువ చేసే వెండి ధారపాత్ర సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారులు దాతలను స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

సంకష్టహర చతుర్థి పూజలు



నందిగామ రూరల్: సంకష్టహర చతుర్థి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విఘ్నేశ్వరాలయాలలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దాములూరు కూడలి, గోళ్లమూడి గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలోని శివాలయాలలో వేంచేసియున్న మహాగణపతిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ముఖ్యంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పుష్పార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లోని సిద్ధి బుద్ధి సహిత వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో అర్చకులు రఘుశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి సుగంధ, పంచామృతాలతో అభిషేకాలు, విశేష అర్చనాది పూజలను వేదోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు





పెనుగంచిప్రోలు:రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గంపలగూడెం మండలం వినగడప గ్రామానికి చెందిన బత్తుల దుర్గేష్ హుజూర్‌నగర్ నుంచి బైక్‌పై వస్తున్నారు. పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద మినీలారీ వేమవరం తిరిగే క్రమంలో వెనుక వస్తున్న దుర్గేష్ బైక్ ప్రమాదవశాత్తూ లారీ టైర్ల కిందకు వెళ్లింది. ప్రమాదంలో అతని కాలుకు తీవ్ర గాయం అయింది. గాయపడిన దుర్గేష్‌ను 108 వాహనంలో పెనుగంచిప్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత కంటివైద్య శిబిరం

నందిగామటౌన్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్మ సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం తొమ్మిది గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసంఘ ప్రతినిధి బాబురావు తెలిపారు. ఈ శిబిరంలో పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని ప్రజలకు కంటి వైద్యపరీక్షలు చేస్తారన్నారు.స్థానిక కమ్మ హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు ప్రారంభిస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేటఅర్బన్:పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్‌లో ఉన్న శ్రీస్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం జేష్ఠ మాసం సంకష్టహర చతుర్థి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు భరద్వాజ్ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, గరికపూజ, విశేష అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపారులు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చు

ముక్త్యాల(జగ్గయ్యపేట): యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చని, అందరూ యోగా సాధన చేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పడవపై శనివారం ఆయన పలు శాఖల అధికారులతో కలిసి యోగాసనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ యోగాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగా ఔన్నత్యాన్ని చాటేందుకు గ్రామస్థాయి అధికారులు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఏపీవో రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, యోగా మాస్టర్ అశ్విని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంద్రాయిలో..

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గంద్రాయి గ్రామంలో సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. యోగాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యోగా సాధనను అందరూ జీవితంలో ఓ భాగం చేసుకోవాలని గ్రామసచివాలయ కార్యదర్శి సంధ్య సూచించారు. అనంతరం యోగాసనాలు, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక ఎస్‌ఎస్‌పీ గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అరేపల్లి వెంకటేశ్వర్లు, సంస్థ సభ్యులు కలిసి యోగాసనాలు సాధన చేశారు. యోగా ప్రతిజ్ఞ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత మెరుగుపడుతుందన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది జి.లక్ష్మీనారాయణ, సంస్థ ప్రతినిధులు భూపతి రామరాజు, హనుమంతరావు, బీవీ రావు, నాగేశ్వరరావు, సాగర్ మాస్టర్, పెసరమిల్లి వెంకటేశ్వరరావు, రాము, అమర్లపూడి రమేష్, మధు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా కార్యక్రమం నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌తోపాటు ఎంపీడీఓ జి.శ్రీను పాల్గొన్నారు. కొణకంచిలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి మాట్లాడుతూ యోగాతో కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: క్రమశిక్షణ కలిగిన జీవన విధానానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయటం వల్ల ఆందోళన తగ్గటంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా యోగా సాధన చేయాలని సూచించారు. అనంతరం వ్యాయామాలు, ఆసనాలు సాధన చేశారు. యోగా గురువు గాడిపర్తి సీతారామ్, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, యోగాంధ్ర కోఆర్డినేటర్లు కృష్ణమోహన్, కవిత, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ప్రజలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : ప్రతిఒక్కరూ ఆరోగంగా ఉండాలంటే యోగాసనాలు చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఇందుపల్లి నానిబాబు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కునికెనపాడులో శనివారం గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు యోగాసనాలు సాధన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి శ్రమ కలిగిస్తేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిత్యం కష్టపడి పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారని గుర్తుచేశారు. ఉద్యోగులు ప్రతి ఉదయం వాకింగ్, యోగాసనాలు చేస్తే రోగాలు దరిచేరవని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కీసరలో...

మండలంలోని కీసరలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి తహసీల్దార్ వీ మానస ఆధ్వర్యంలో యోగాసనాలు సాధన చేశారు. మానస మాట్లాడుతూ ప్రతిరోజూ అందరూ ఉదయాన్నే యోగాసనాలు చేస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు: యోగా సాధనతో పలురకాల రుగ్మతల బారి నుంచి బయటపడవచ్చని ఎంపీడీవో రాజు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని జుజ్జూరులోని జల్లి ఏసోబు కల్యాణ మండపంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, వీఆర్వోలతో కలిసి శనివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు యోగాను తమ జీవితంలో ఒకభాగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం యోగా సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ కోటి, ఆయాశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ముక్త్యాల వద్ద పడవపై యోగాసనాలు వేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, అధికారులు


గంద్రాయిలో ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది


యోగాసనాలు వేస్తున్న ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ సభ్యులు


పెనుగంచిప్రోలులో యోగాసనాలు సాధన చేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్ తదితరులు


కునికెనపాడులో యోగా ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ నానిబాబు, సచివాలయ సిబ్బంది


కీసరలో యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, డ్వాక్రా మహిళలు


జుజ్జూరులో యోగా చేస్తున్న ఎంపీడీవో రాజు , సర్పంచులు, అధికారులు, గ్రామస్తులు

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ, అభివృద్ధి సంఘం వారి సహకారంతో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తన నివాసంలో శనివారం పట్టణానికి చెందిన గీతికా రామ్, పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామానికి చెందిన జిడుగు జగన్నాథంలకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందేలా కృషిచేసిన జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు.

ప్రమాద బాధితులకు నివాళి



కంచికచర్ల: ఇటీవల అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో అశువులు బాసిన ప్రయాణికులు, మెడికల్ విద్యార్థుల ఆత్మకు శాంతిచూకూరాలని కోరుకుంటూ పరిటాల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శనివారం నివాళులర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, కరస్పాండెంట్ కే రామ్మోహనరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నందిగామరూరల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తెలిపారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డులోని రైతుబజార్ పరిసరాలలో రోడ్డు పక్కన ఆక్రమణలను శనివారం ఆయన తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైతుబజార్ బయటి పక్క ఏర్పాటు చేసిన స్టాల్స్‌లోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించటంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబి రాణి అన్నారు. ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీసీ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ ఇంజినీరింగ్ పేరుతో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల పరిస్థితి మరలా మొదటికి వచ్చిందన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ పదవులు బీసీలకు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో జన గణనతో పాటు బీసీ కుల గణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుంచి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పోస్టు కార్డుల ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేస్తామన్నారు. త్వరలోనే ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి శ్రీకాంత్, నిడుముక్కల సాంబశివరావు, పాటూరి శ్రీనివాసరాజు, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పోలంపల్లి రాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, తన్నీరు శ్రీను, యాదాద్రి తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బేబి రాణి

దుర్గమ్మ సన్నిధిలో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్దిని పురస్కరించుకుని శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో గణపతి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు భక్తులు, ఉభయ దాతలు హోమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కె.వియన్నారావు చెప్పారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేకర్స్ స్పేస్ ల్యాబ్‌ను ఆచార్య వియన్నారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ కొత్త ఆవిష్కరణల వేదికగా విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. దీనిని గొప్ప అవకాశంగా విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు పరిశోధనల దిశగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, ప్రిన్సిపాల్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి ల్యాబ్ ఇన్‌చార్జి జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

జగ్గయ్యపేట: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ భవానీ శనివారం సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కెవైసీ చేయించుకోకపోతే అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులవుతారని పేర్కొన్నారు.

కర్నాటి రామ్మోహన్‌రావుకు నివాళి

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో కర్నాటి రామ్మోహనరావు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన్‌రావు న్యాయవాది అయినప్పటికీ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. రిటైర్డ్ హైకోర్టు రిజిస్ట్రార్ తల్లా వేణుగోపాలరావు రామ్మోహన్‌రావు సేవలను కొనియాడారు. సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు మాట్లాడుతూ ఒక్క బెజవాడలోనే కాదు దేశంలో ఎక్కడ మానవ హక్కులకు భంగం కలిగినా రామ్మోహన్‌రావు ముందుండి వారికి న్యాయం జరిగే వరకు పోరాడేవారని వివరించారు. బార్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కర్నాటి వారితో కలిసి ఎన్నో ఉద్యమాలలో పాల్గొనే అవకాశం తనకు దక్కిందన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ వీకేఆర్ కృపాసాగర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.